బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 26 డిసెంబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4


## జీహెచ్ఎంసీ డీలిమిటేషన్‌కు నోటిఫికేషన్

- డివిజన్ల సంఖ్యను 300కు పెంపు
- 6 జోన్లు 12కు, 30 సర్కిళ్లు 60కి పెంపు
- తుది నోటిఫికేషన్ విడుదల చేసిన ప్రభుత్వం

**బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో**

జీహెచ్ఎంసీ డీలిమిటేషన్‌కు సంబంధించి తుది నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. డివిజన్ల సంఖ్యను 300కు పెంచుతూ నోటిఫికేషన్ జారీ అయింది. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రస్తుతం ఉన్న 6 జోన్లను 12కు, ప్రస్తుతం ఉన్న 30 సర్కిళ్లను 60కి పెంచుతున్నట్టు నోటిఫికేషన్‌లో పేర్కొంది. జీహెచ్ఎంసీలో కొత్త జోన్లుగా ఉప్పల్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, శంషాబాద్, గోల్కొండ, రాజేంద్రనగర్ ఏర్పడ్డాయి. సర్కిల్ కార్యాలయాల్లో కొత్త జోన్ కార్యాలయాలు, వార్డు కార్యాలయాల్లో నూతన సర్కిల్ కార్యాలయాలు ఏర్పాటు కానున్నాయి. డివిజన్ల డీలిమిటేషన్‌కు సంబంధించి ఈనెల 9న ప్రాథమిక నోటిఫికేషన్ వెలువడగా.. 10 రోజులపాటు అభ్యంతరాలు స్వీకరించారు. 6వేలకు పైగా అభ్యంతరాలు రాగా.. సహేతుకమైన వాటిని పరిగణనలోకి తీసుకొని తుది నోటిఫికేషన్ విడుదల చేసినట్టు అధికారులు తెలిపారు.



## కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం:

- 9 మంది సజీవ దహనంలిలి
- చిత్రదుర్గ జిల్లా జవారగుండనహళ్లి వద్ద విషాద ఘటన
- ప్రధాని దిగ్భ్రాంతి.. మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా, గాయపడిన వారికి రూ. 50 వేల ఆర్థిక సాయం

**బలగం టీవి, బెంగళూరు**

కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. చిత్రదుర్గ జిల్లా జవారగుండనహళ్లి సమీపంలో గురువారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో తొమ్మిది మంది సజీవ దహనమయ్యారు. బెంగళూరు నుంచి గోకర్ణం వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును ఎదురుగా వచ్చిన కంటైనర్ లారీ ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించింది. పోలీసుల వివరాల ప్రకారం, ప్రమాదం జరిగిన సమయంలో బస్సులో 32 మంది ప్రయాణికులు ఉన్నారు. లారీ ఢీకొట్టడంతో బస్సు డీజిల్ ట్యాంక్ పగిలి మంటలు చెలరేగాయి. బస్సు వెనుక భాగంలో ఉన్న ప్రయాణికులు బయటకు రాలేక అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ఒక చిన్నారి కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాద సమాచారం అందగానే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన వారిని హిరియూరు, సిరా, తుమకూరు ఆస్పత్రులకు తరలించారు. కొందరిని మెరుగైన చికిత్స కోసం బెంగళూరుకు తరలించారు. మొత్తం 24 మంది ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు.

పోలీసుల సమాచారం ప్రకారం, ప్రమాదం జరిగిన సమయంలో బస్సు వెనుక భాగంలో ఉన్న ప్రయాణికులు తప్పించుకోలేకపోయారు. లారీ డ్రైవర్ సహా మొత్తం తొమ్మిది మంది మృతి చెందారు. ప్రమాదానికి కారణం లారీ నిర్లక్ష్యమేనని ప్రాథమిక విచారణలో తేలింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోంది. ప్రమాదం చోటు చేసుకున్న సమయంలో సమీపంలో వెళ్తున్న ఒక స్కూల్ బస్సు ప్రమాదానికి త్రుటిలో తప్పించుకుంది. ఆ బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థులందరూ క్షేమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.

**ప్రధాని దిగ్భ్రాంతి**

ఈ ప్రమాదంపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధాని జాతీయ సహాయ నిధి నుంచి ఒక్కొక్కరికి రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. బాధిత కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

# ఆర్టికల్ 370 రద్దు ఎన్డీయేకు గర్వకారణం

- క్రిస్మస్ పండుగ ప్రజల జీవితాల్లో ఆనందం, శాంతి నింపాలి
- ప్రధాని నరేంద్ర మోదీ
- మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 101వ జయంతి సందర్భంగా లక్నోలో 'ప్రేరణస్థల్' ప్రారంభించిన ప్రధాని



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370ను రద్దు చేసే అవకాశం ఎన్డీయే ప్రభుత్వానికి దక్కడం గర్వకారణమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయీ 101వ జయంతిని పురస్కరించుకుని ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఏర్పాటు చేసిన 'ప్రేరణస్థల్'ను ప్రారంభించిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. స్వాతంత్ర్యం తరువాత దేశంలో అమలైన విధానాలను విమర్శించిన ప్రధాని మోదీ, కాంగ్రెస్ పాలన దేశ ప్రయోజనాలను విస్మరించిందన్నారు. జమ్మూ కశ్మీర్‌లో రెండు రాజ్యాంగాలు, రెండు ప్రధానులు అనే పరిస్థితి కొనసాగడం దేశ సమగ్రతకు పెద్ద సవాలుగా మారిందని, దానిని సరిచేసే అవకాశం తమ ప్రభుత్వానికి లభించిందని తెలిపారు. "డాక్టర్ శ్యామాప్రసాద్ ముఖర్జీ కలలు నేడు నెరవేరాయి. దేశమంతటా ఒకే రాజ్యాంగం అమలవుతోంది" అని మోదీ పేర్కొన్నారు. అంతేకాకుండా, క్రిస్మస్ సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. క్రిస్మస్ పండుగ ప్రజల జీవితాల్లో ఆనందం, శాంతి నింపాలని ఆకాంక్షించారు.

**అటల్ జీ కలలకు కొనసాగింపే అభివృద్ధి**

అటల్ బిహారీ వాజ్‌పేయీ హయాంలోనే గ్రామీణ రహదారుల విస్తరణకు బీజం పడిందని ప్రధాని గుర్తు చేశారు. గత 11 ఏళ్లలో దేశవ్యాప్తంగా సుమారు 4 లక్షల కిలోమీటర్ల గ్రామీణ రహదారులు నిర్మించామని తెలిపారు. అలాగే దేశవ్యాప్తంగా ఎక్స్‌ప్రెస్‌వేలు, మెట్రో నెట్‌వర్క్ విస్తరణకు ఊపొచ్చిందని చెప్పారు. మొబైల్ తయారీలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా మారిందని, ముఖ్యంగా ఉత్తర్‌ప్రదేశ్ ఈ రంగంలో కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు.

**ప్రేరణస్థల్- జాతీయ స్ఫూర్తి కేంద్రం**

లక్నోలో ఏర్పాటు చేసిన ప్రేరణస్థల్‌ను దేశభక్తి, నాయకత్వం, సేవా భావాలకు ప్రతీకగా అభివర్ణించారు. ఈ ప్రాంగణంలో శ్యామాప్రసాద్ ముఖర్జీ, దీన్‌దయాల్ ఉపాధ్యాయ, అటల్ బిహారీ వాజ్‌పేయీ విగ్రహాలను ప్రతిష్ఠించామని తెలిపారు. 65 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమైన ఈ ప్రాంగణంలో 98 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆధునిక మ్యూజియం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇది రాబోయే తరాలకు జాతీయ స్ఫూర్తిని అందించే కేంద్రంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## సీఎంను కలిసిన కొండారెడ్డిపల్లి సర్పంచ్



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని కొండారెడ్డిపల్లి సర్పంచ్ మల్లెపాకుల వెంకటయ్యతో పాటు వార్డు సభ్యులు గురువారం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. సీఎం సొంత గ్రామమైన కొండారెడ్డి పల్లిలో మొదటి విడతలో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ క్రమంలో సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు.

## మైసూర్‌లో భారీ పేలుడు

- బెలూన్ గ్యాస్ సిలిండర్ పేలి ఒకరి మృతి
- నలుగురికి తీవ్ర గాయాలులిలి



**బలగం టీవి, మైసూరు**


కర్ణాటక రాష్ట్రంలోని మైసూర్ నగరంలో శుక్రవారం రాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. చారిత్రక మైసూర్ ప్యాలెస్ సమీపంలోని జయమార్తాండ గేట్ వద్ద బెలూన్ గ్యాస్ సిలిండర్ పేలడంతో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు.

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి సుమారు 8.30 గంటల సమయంలో సైకిల్‌పై హీలియం బెలూన్లు అమ్ముతున్న వ్యక్తి గ్యాస్ నింపుతుండగా ఒక్కసారిగా సిలిండర్ పేలింది. పేలుడు తీవ్రతకు బెలూన్ విక్రేత అక్కడికక్కడే మృతి చెందగా, సమీపంలో ఉన్న మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన వారిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు. మృతుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మైసూర్ పోలీస్ కమిషనర్ సీమా లట్కర్ మాట్లాడుతూ, ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపారు. క్రిస్మస్ సెలవుల సందర్భంగా మైసూర్ ప్యాలెస్ సందర్శకులతో కిటకిటలాడుతుండటంతో ఈ ఘటన ప్రజల్లో భయాందోళన కలిగించిందని పేర్కొన్నారు. ఈ ప్రమాదం నేపథ్యంలో భద్రతా చర్యలను మరింత కఠినతరం చేసినట్లు పోలీసులు తెలిపారు.

## ఒడిశాలో భారీ ఎన్‌కౌంటర్

- ఆరుగురు మావోయిస్టులు మృతి
- మృతుల్లో అగ్రనేత గణేశ్ ఉయికే ..!
- నక్సలిజం నిర్మూలన దిశగా కీలక ముందడుగు కేంద్ర హోంమంత్రి అమిత్ షా





**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

ఒడిశాలోని కంధమాల్ జిల్లాలో గురువారం ఉదయం భారీ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. భద్రతా దళాలతో జరిగిన ఎదురుకాల్పుల్లో నిషేధిత సీపీఐ(మావోయిస్టు) సంస్థకు చెందిన కేంద్ర కమిటీ సభ్యుడు, ఒడిశా ఆపరేషన్స్ హెడ్ గణేశ్ ఉయికే (69)తో పాటు మరో ముగ్గురు మావోయిస్టులు చనిపోయారు. మంగళవారం నుంచి కొనసాగుతున్న ఎదురు కాల్పులతో మొత్తం మృతుల సంఖ్య ఆరుకు చేరిందని అధికారులు తెలిపారు.

ఒడిశాలోని కంధమాల్ జిల్లాలోని అడవీ ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై సమాచారం అందడంతో భద్రతా దళాలు గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు ఎదురుపడటంతో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో గణేశ్ ఉయికే సహా ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. మృతుల్లో రాజేశ్ తివారి, చమ్రు, రూపా తదితరులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎన్‌కౌంటర్ ప్రాంతం నుంచి ఒక రివాల్వర్, 303 రైఫిల్, రెండు ఇన్సాస్ రైఫిళ్లు, వాకీటాకీ సెట్‌ను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ప్రస్తుతం ఒడిశా%-%ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఇందుకోసం ఎస్ఓజీ, సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్ బలగాలతో కలిపి 23 బృందాలను రంగంలోకి దించారు.


**గణేశ్ ఉయికే నేపథ్యం**

హతమైన గణేశ్ ఉయికే స్వస్థలం తెలంగాణలోని నల్గొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామం. ఆయన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడిగా కీలక పాత్ర పోషిస్తూ, దేశవ్యాప్తంగా అనేక దాడులకు సూత్రధారిగా ఉన్నాడని అధికారులు తెలిపారు. అతనిపై ప్రభుత్వం రూ.1.10 కోట్ల బహుమతి ప్రకటించింది.

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట్లాడుతూ ఈ ఎదురుకాల్పును నక్సలిజం నిర్మూలన దిశగా కీలక మైలురాయిగా పేర్కొన్నారు. "ఒడిశా త్వరలోనే మావోయిస్టు రహిత రాష్ట్రంగా మారబోతోంది. 2026 మార్చి 31 నాటికి దేశాన్ని పూర్తిగా నక్సలిజం నుంచి విముక్తం చేయాలన్నది మా లక్ష్యం" అని స్పష్టం చేశారు. మావోయిస్టులతో చర్చలు జరిపే ప్రశ్నే లేదని కేంద్ర హోంమంత్రి స్పష్టం చేశారు. ఆయుధాలు విడిచిపెట్టి లొంగిపోతే ప్రభుత్వం పునరావాసం కల్పిస్తుందని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గత దశాబ్దంలో ఛత్తీస్‌గఢ్ సహా నక్సల్ ప్రభావిత ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం రూ.4 లక్షల కోట్లకు పైగా ఖర్చు చేసిందని తెలిపారు. నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించి దేశంలో శాంతి, అభివృద్ధి నెలకొల్పడమే ప్రభుత్వ లక్ష్యమని మరోసారి స్పష్టం చేశారు.

## తల్లీ, కొడుకు దారుణ హత్య

- మరొకరికి గాయాలు
- వివాహేతర సంబంధమే కారణం..?





**బలగం టీవి, సంగారెడ్డి**

తల్లీ, కొడుకు దారుణ హత్యకు గురైన ఘటన సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ మున్సిపాల్టీలోని జేపీ కాలనీలో గురువారం జరిగింది. మరోవ్యక్తి కత్తిపోటుకు తీవ్రంగా గాయపడ్డారు. కాగా, ఈ హత్యకు వివాహేతర సంబంధమే కారణమని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగ్ ప్రాంతానికి చెందిన శివరాజు క్యాబ్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి వనపర్తి జిల్లా అమరచింతకు చెందిన చంద్రకళ (30)తో వివాహేతర సంబంధం ఏర్పడిందని తెలిసింది. ఈ క్రమంలో చంద్రకళ, ఆమె కుమారుడు రేవంత్ కుమార్(15)తో కలిసి శివరాజు.. నాలుగు రోజుల క్రితం తెల్లాపూర్‌లోని జేపీ కాలనీలో ఓ ఇంట్లో అద్దెకు దిగారు. అయితే గురువారం మధ్యాహ్నం సుమారు 1:30 గంటల ప్రాంతంలో అద్దెకున్న ఇంట్లో చంద్రకళ, రేవంత్‌కుమార్, శివరాజు రక్తపు మడుగులో ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. కాగా, తల్లీ కొడుకు అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్ర గాయాలతో ఉన్న శివరాజును దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తరలించారు. అడిషనల్ డీసీపీ ఉదయ్ రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని.. హత్య జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. తల్లి, కొడుకును శివరాజే కత్తితో గొంతు కోసి అనంతరం అతను కూడా ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. వివాహేతర సంబంధమే హత్యకు దారితీసి ఉండొచ్చని సమాచారం. సంఘటనా స్థలానికి క్లూస్ టీమ్, ఫింగర్ ప్రింట్ టీమ్ పోలీసులు చేరుకొని క్షుణ్ణంగా పరిశీలించారు.

## తెలంగాణలో ఐఏఎస్ అధికారుల బదిలీలు

- జయేశ్ రంజన్‌కు కీలక బాధ్యతలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఐఏఎస్ అధికారుల బదిలీలకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది. హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా (స్పెషల్ సీఎస్) జయేశ్ రంజన్‌ను నియమించింది. ఆయన పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా కూడా కొనసాగనున్నారు. సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా ఉన్న హరితను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శిగా నియమించారు. ఆమె స్థానంలో తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు గరిమా అగర్వాల్ సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా కొనసాగనున్నారు.

**జీహెచ్ఎంసీ పరిధిలోని వివిధ జోన్లకు కొత్త కమిషనర్లను ప్రభుత్వం నియమించింది.**

శేరిలింగంపల్లి-భోర్కాడే హేమంత్ సహదేవరావు, కూకట్‌పల్లి-అపూర్వ చౌహాన్, కుత్బుల్లాపూర్ - సందీప్ కుమార్ ఝా, చార్మినార్-ఎస్. శ్రీనివాస్ రెడ్డి, గోల్కొండ-జి. ముకుంద రెడ్డి, ఖైరతాబాద్-ప్రియాంక, రాజేంద్రనగర్ -అనురాగ్ జయంతి, సికింద్రాబాద్ - ఎన్. రవి కిరణ్, శంషాబాద్-కె. చంద్రకళ, ఎల్బీనగర్ - హేమంత్ కేశవ్ పాటిల్, మల్కాజ్‌గిరి - సంచిత్ గంగ్వార్, ఉప్పల్ - రాధిక గుప్తా, అదేవిధంగా మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఇ.వి. నర్సింహారెడ్డిని ప్రభుత్వం నియమించింది. ఈ బదిలీలతో రాష్ట్ర పరిపాలనలో సమర్థవంతమైన పాలనను మరింత బలోపేతం చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.

## విద్యార్థులకు సరైన ఆహారం అందని పరిస్థితి

- తండ్రి వయసున్న కేసీఆర్‌ను ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడడం సరికాదు
- మాజీ మంత్రి టి.హరీష్‌రావు
- సిద్దిపేటలో అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో బ్లాంకెట్ల పంపిణీ
- విద్యార్థులతో కలిసి భోజనం



వివరాలు 4వ పేజీలో

## ముగిసిన ప్రభాకర్‌రావు కస్టడీ

- పెన్‌డ్రైవ్ నుంచే ఆధారాలు సేకరించిన సిట్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావును 14 రోజుల పాటు విచారించిన సిట్ అధికారులు అనేక కీలక ఆధారాలను సేకరించారు. గురువారం చివరి రోజు కాగా...ఆయనతో పాటు ఈ కేసులో ఇప్పటికే అరెస్టు అయిన బెయిల్‌పై ఉన్న ఎస్ఐబీ డీఎస్పీ ప్రవీణ్‌రావు, నగర టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌రావు, అదనపు ఎస్పీలు భుజంగరావు, తిరుపతయ్య, ఒక మీడియా ఛానల్ యజమాని శ్రవణ్‌కుమార్‌లను కలిపి జూబ్లీహిల్స్‌లోని సిట్ కార్యాలయంలో అధికారులు 10 గంటలకుపైగా విచారించారు. అంతకముందు ఫోన్ ట్యాపింగ్ జరిపే విషయంపై ప్రభాకర్‌రావు తనకు ఇచ్చిన ఆదేశాల గురించి మరోసారి పై నలుగురు అధికారులను మరోసారి సిట్ అధికారులు విచారించారు. ఆ సమయంలో ప్రభాకర్‌రావును ఎదుటగానే ఉంచుకుని వారిపై ప్రశ్నల వర్షం కురిపించారు. మధ్యలో వారు చెబుతున్న అంశాలపై ప్రభాకర్‌రావును క్రాస్ ఇంటరాగేషన్ చేసి కొన్ని కీలక వివరాలను రాబట్టినట్టు తెలిసింది. ఆ సమయంలో సైతం ప్రభాకర్‌రావు కొన్ని ప్రశ్నలకు నో అంటూ సమాధానం ఇచ్చాడని తెలిసింది. కాగా, ఆయన నో అన్నప్పటికీ ఆయన కింద పనిచేసిన పై నలుగురు అధికారులు ఇచ్చిన సమాచారంలో ఉన్న నిజాలను దర్యాప్తు అధికారులు గట్టిగా విశ్వసిస్తూ దానికి సంబంధించిన ఆధారాలను సైతం సేకరించినట్టు తెలిసింది. మొత్తం మీద ఈ కీలక విచారణలో ఫోన్ ట్యాపింగ్ జరిగిన వ్యవహారం, జరిపించింది ఎవరు? వారి నేరాన్ని రుజువు చేసే ఆధారాలను సిట్ అధికారులు సమగ్రంగా సేకరించినట్టు తెలిసింది. శుక్రవారంతో ప్రభాకర్‌రావు కస్టడీకి సంబంధించి సుప్రీం కోర్టు ఇచ్చిన గడువు పూర్తికానుండటంతో ఆయనను విడుదల చేయడానికి అవసరమైన చర్యలను కూడా సిట్ అధికారులు తీసుకుంటున్నట్టు తెలిసింది. కాగా, ప్రభాకర్‌రావుకు సంబంధించిన పెన్‌డ్రైవ్ నుంచి ఫోన్ ట్యాపింగ్ చేశారనడానికి కీలకమైన ఆధారాలను అధికారులు విశ్లేషించి సేకరించారని సమాచారం. బీఆర్ఎస్‌కు చెందిన ప్రముఖ నేతల పాత్రను కూడా గుర్తించినట్టు తెలిసింది. ఈ విచారణలో సిట్ సభ్యులు అంబర్‌కిశోర్ ఝా, విజయ్‌కుమార్, రితురాజ్, నారాయణరెడ్డి, శ్రీధర్, వెంకటగిరి తదితరులు పాల్గొన్నారు.

**ప్రభాకర్‌రావు కుమారుడిని విచారించిన సిట్**

ఇదిలా ఉంటే, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు కుమారుడు నిశాంత్‌రావును సిట్ అధికారులు గురువారం నాలుగు గంటల పాటు విచారించారు. నిశాంత్‌రావు చేసే వ్యాపారాలు, ఇతర ఆర్థిక లావాదేవీల గురించి ఆరా తీసినట్టు తెలిసింది. ముఖ్యంగా, అతని బ్యాంక్ స్టేట్‌మెంట్లను ముందు ఉంచుకుని అందులో తమకు ఉన్న అనుమానాలను నిశాంత్ రావు ద్వారా నివృత్తి చేసుకునే ప్రయత్నాన్ని సిట్ అధికారులు చేశారు.

ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో విచారణను చరమాంకానికి చేర్చుతూ సిట్ అధిపతి, నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ గురువారం రాష్ట్ర ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ డీజీపీలను విచారించినట్టు తెలిసి ంది. బంజారాహిల్స్‌లో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ కార్యాల యంలోని తన ఛాంబర్‌కు మాజీ సీఎస్ సోమేశ్‌కుమార్, మాజీ డీజీపీ మహేందర్‌రెడ్డిలను సజ్జనార్ పిలిపించి విచారణ జరిపినట్టు తెలిసింది. ముఖ్యంగా పదవీ విరమణ చేసిన ప్రభాకర్‌రావును అత్యంత కీలకమైన ఎస్ఐబీ ఓఎస్‌డీగా నియమించడానికి గల కారణాలను సోమేశ్‌కుమార్, మహేందర్‌రెడ్డి నుంచి తెలుసుకునే ప్రయత్నం చేశారని తెలిసింది. సాధారణంగా పదవీ విరమణ చేసిన అధికారులను ఎస్ఐబీ వంటి విభాగానికి ఇన్‌చార్జిగా నియమించడం ఎంత వరకు సబబు అంటూ కూడా ఆయన సమాధానాలను రాబట్టే ప్రయత్నం చేశారని తెలుస్తోంది. కాగా, ఈ పూర్తి విచారణలో ఆ సమయంలో ఏ నిర్ణయం జరిగినా ప్రభుత్వ ఆదేశాల మేరకే అని మాజీ అధికారులు తెలిపినట్టు విశ్వసనీయంగా తెలిసింది. కాగా, ప్రభాకర్‌రావు హయాంలో ఎస్ఐబీ జరిపిన ఫోన్ ట్యాపింగ్‌లలో చాలా వరకు మావోయిస్టులకు సబంధించిన నెంబర్లు అని రివ్యూ కమిటీకి సిఫారసు చేసినట్టు కూడా అధికారులు చెప్పినట్టు తెలిసింది.

## కిలిమంజారోపై ఘోర హెలికాప్టర్ ప్రమాదం

- ఐదుగురు మృతి
- పర్యాటకుల రక్షణకు వెళ్లిన హెలికాప్టర్ కుప్పకూలింది



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

ఆఫ్రికాలోని టాంజానియా దేశంలో ఉన్న కిలిమంజారో పర్వతంపై విషాదకర ఘటన చోటుచేసుకుంది. అనారోగ్యానికి గురైన పర్యాటకులను రక్షించేందుకు బయలుదేరిన హెలికాప్టర్ ప్రమాదవశాత్తు కూలిపోవడంతో ఐదుగురుప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.

టాంజానియా సివిల్ ఏవియేషన్ అథారిటీ వెల్లడించిన వివరాల ప్రకారం, బరాఫు క్యాంప్ సమీపంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. హెలికాప్టర్‌లో ప్రయాణిస్తున్న ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు చెక్ రిపబ్లిక్‌కు చెందిన పర్యాటకులు, ఒక జింబాబ్వే పైలట్, ఒక టాంజానియా వైద్యుడు, మరో స్థానిక పర్వత మార్గదర్శకుడు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అనారోగ్యానికి గురైన ఇద్దరు పర్యాటకులను కిందకు తరలించేందుకు టాంజానియాకు చెందిన సంస్థ నిర్వహిస్తున్న ఎయిర్‌బస్ హెచ్ 125 హెలికాప్టర్‌ను వినియోగించినట్లు కిలిమంజారో ప్రాంతీయ పోలీసు కమాండర్ సైమన్ మైగ్వా వెల్లడించారు. అయితే సహాయక చర్యల మధ్యలోనే హెలికాప్టర్ ప్రమాదానికి గురై కుప్పకూలినట్లు తెలిపారు. ఈ ఘటనకు గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల సాంకేతిక కారణాలు, వాతావరణ పరిస్థితులు, పైలట్‌కు ఎదురైన సవాళ్లు తదితర అంశాలపై సమగ్ర విచారణ చేపడుతున్నామని పేర్కొన్నారు.

ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన పర్వతాల్లో ఒకటైన కిలిమంజారో ప్రతి ఏడాది వేలాది మంది పర్యాటకులను ఆకర్షిస్తోంది. ఈ ప్రాంతాన్ని మరింత పర్యాటకంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో టాంజానియా ప్రభుత్వం ఇటీవల కేబుల్‌కార్ ప్రాజెక్టును కూడా ప్రతిపాదించింది. అయితే తాజా ప్రమాదం నేపథ్యంలో భద్రతా చర్యలపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఏర్పడింది.

## కూతురును చంపేసిన తల్లిదండ్రులు



- వివాహితుడిని ప్రేమించిన కూతురు
- పరువు పోతుందని విషమిచ్చి హత్య
- కరీంనగర్ జిల్లా సైదాపూర్‌లో ఘటన

**బలగం టీవి, కరీంనగర్**

కూతురు ఓ వివాహితుడిని ప్రేమిస్తుందని తెలుసుకున్న తల్లిదండ్రులు.. పలుమార్లు మందలించినా మారకపోవడంతో.. ఈ విషయం బయట తెలిస్తే పరువు పోతుందనుకుని కన్న కూతురిని కర్కషంగా హత్య చేశారు. ఆ తర్వాత ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. పోలీసుల విచారణతో అసలు విషయం ఆలస్యంగా వెలుగుజూసింది. ఈ దారుణ ఘటన కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలంలోని సర్వాయిపేట గ్రామ పరిధిలోని శివరాంపల్లిల్లో జరిగింది. సైదాపూర్ పోలీసుస్టేషన్‌లో గురువారం హుజురాబాద్ ఏసీపీ మాధవి విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. శివరాంపల్లికి చెందిన రెడ్డి రాజు, రెడ్డి లావణ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. చిన్న కుమార్తె(16) అదే గ్రామానికి చెందిన ఓ వివాహితుడిని ప్రేమిస్తుందని తెలుసుకున్న తల్లిదండ్రులు పలుమార్లు మందలించారు. అయినా తీరు మారకపోవడంతో నవంబర్ 14వ తేదీన బాలికకు బలవంతంగా పురుగుల మందు తాగించారు. ఆ తర్వాత గొంతు నులిమి హత్య చేశారు. తరువాత తమ కూతురు కడుపు నొప్పి భరించలేక పురుగుల మందు తాగి చనిపోయిందని తల్లిదండ్రులు సైదాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిశీలించి వారు చెప్పిన విషయాలు పొంతన లేకపోవడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అన్ని కోణాల్లో దర్యాప్తు చేశారు. ఫోరెన్సిక్ నివేదికతో హత్యగా గుర్తించిన పోలీసులు తల్లిదండ్రు లను విచారించారు. ప్రేమ వ్యవహారం బయటికి వస్తే పరువుపోతుందని హత్య చేసినట్టు ఒప్పుకున్నారు. దీంతో వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామని ఏసీపీ మాధవి తెలిపారు. సమావేశంలో హుజురాబాద్ రూరల్ సీఐ పులి వెంకట్, సైదాపూర్ ఎస్ఐ తిరుపతి ఉన్నారు.

# మెదక్ చర్చిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

- భక్తులతో కిటకిటలాడిన చర్చి ప్రాంగణం

**బలగం టీవీ, మెదక్**



ప్రపంచ ప్రఖ్యాత మెదక్ కేథడ్రల్ చర్చిలో క్రిస్మస్ వేడుకలు వైభవంగా నిర్వహించబడ్డాయి. శుక్రవారం తెల్లవారుజామునే ప్రత్యేక ప్రార్థనలతో వేడుకలు ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి నుంచే క్రిస్మస్ సంబురాల్లో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో మెదక్ సీఎస్ఐ చర్చికి తరలివచ్చారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు చేరుకోవడంతో పాటు, పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రల నుంచి కూడా క్రైస్తవులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. దీంతో చర్చి ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ప్రధాన ఆరాధన కార్యక్రమంలో చర్చి ఇన్‌చార్జ్ బిషప్ రైట్ రెవరెండ్ రూబెన్ మార్క్ పాల్గొని భక్తులను ఉద్దేశించి దైవవాక్య సందేశం ఇచ్చారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటున్న ప్రజలందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. శాంతి, సౌభ్రాతృత్వం, ప్రేమతో కూడిన జీవనం సాగించాలని ఆయన పిలుపునిచ్చారు. క్రిస్మస్ సందర్భంగా చర్చిని విద్యుద్దీపాలతో, పుష్పాలతో సుందరంగా అలంకరించారు. ప్రత్యేక ప్రార్థనలు, గీతాలు, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పండుగ వాతావరణం మెదక్ పట్టణమంతా వెల్లివిరిసింది.

# కేరళలో బర్డ్ ఫ్లూ పంజా

- ఇప్పటివరకు సుమారు 55 వేల బాతులు, కోళ్లు మృత్యువాత

**బలగం టీవీ, హైదరాబాద్**

కేరళ రాష్ట్రంలోని కుట్టనాడు ప్రాంతంలో బర్డ్ ఫ్లూ మళ్లీ విజృంభిస్తోంది. శతాబ్దాలుగా బాతుల పెంపకానికి పేరుగాంచిన ఈ ప్రాంతంలో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. గడచిన 11 ఏళ్లలో ఇది ఏడోసారి బర్డ్ ఫ్లూ విజృంభణ కావడం గమనార్హం. అలప్పుజ జిల్లా పరిధిలోని ఎనిమిది పంచాయతీలు, కొట్టాయం జిల్లాలోని నాలుగు పంచాయతీల్లో వ్యాధి తీవ్రంగా వ్యాపించింది. ఈ వ్యాధి ప్రభావంతో ఇప్పటివరకు సుమారు 55 వేల బాతులు, కోళ్ళు మృత్యువాత పడ్డాయి. వైరస్ మరింత విస్తరించకుండా నిరోధించేందుకు మరో 25 వేల బాతులు, కోళ్లను అధికారులు నశింపజేశారు. దీంతో కుట్టనాడు ప్రాంతంలో బాతుల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న వందలాది కుటుంబాలు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి.

ప్రతి ఏడాది రెండు విడతల్లో బాతుల పెంపకం జరగడం ఆనవాయితీ కాగా, క్రిస్మస్, ఈస్టర్ పండుగల సమయంలోనే బర్డ్ ఫ్లూ దాడి జరుగుతుండటం రైతులను ఆందోళనకు



గురిచేస్తోంది. అలప్పుజ జిల్లా చెరుతన ప్రాంతానికి చెందిన బాతుల రైతు జీ. రామచంద్రన్ మాట్లాడుతూ, తన ఫారంలో 30 రోజుల వయస్సున్న 15 వేల బాతుల్లో 12 వేల బాతులు చనిపోయాయని తెలిపారు. మిగిలిన మూడు వేల బాతులను కూడా నిబంధనల ప్రకారం తొలగించాల్సి వచ్చిందన్నారు. ఈ సీజన్‌లో సుమారు రూ.20 లక్షల నష్టం వాటిల్లిందని, వచ్చే ఏడాది క్రిస్మస్ నాటికి అయినా పరిస్థితులు మెరుగుపడాలని ఆశిస్తున్నట్లు చెప్పారు.

2014లోనూ ఇలాగే 4,500 బాతులు వ్యాధి బారిన పడి నష్టపోయామని, వరుస నష్టాలతో ఇక బాతుల పెంపకం కొనసాగించలేమేమోనన్న ఆవేదనను ఆయన వ్యక్తం చేశారు. గతంలో ఈ ప్రాంతంలో ప్రతి సీజన్‌కు దాదాపు 15 లక్షల బాతులను పెంచి విక్రయించేవారని, ప్రస్తుతం ఆ సంఖ్య మూడు లక్షలకు పడిపోయిందని తెలిపారు. బర్డ్ ఫ్లూ వ్యాప్తి నేపథ్యంలో చిన్న, మధ్యతరహా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని ఐక్య తరవు కర్షక సంఘం అధ్యక్షుడు రాజశేఖరన్ డిమాండ్ చేశారు. వ్యాధి నియంత్రణ చర్యలు ఖరీదైనవిగా మారడంతో అనేక మంది రైతులు ఈ వృత్తిని వదిలేస్తున్నారని తెలిపారు.

మరోవైపు, నీటి వనరులు ఉన్న ప్రాంతాల మధ్య బాతులను తరలించడం వల్ల వ్యాధి వేగంగా వ్యాపిస్తున్నట్లు వెటర్నరీ వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి బాతులను తరలించడం వల్ల ఫ్లూ వ్యాప్తి ప్రమాదం పెరుగుతోందని, కఠిన పర్యవేక్షణ లేకపోతే నియంత్రణ అసాధ్యమని వారు స్పష్టం చేస్తున్నారు. కుట్టనాడు ప్రాంతంలో నీటి వనరులు అధికంగా ఉండటంతో పక్షులు పెద్ద సంఖ్యలో చేరుతున్నాయని తెలిపారు. రెండు జిల్లాల్లో వైరస్ వ్యాప్తిని అడ్డుకునేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కేరళ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ అధికారులు సూచించారు.

# కేసీఆర్ లేకపోతే తెలంగాణ వచ్చేదా?

- తెలంగాణ లేకపోతే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేవారా?
- మాజీ మంత్రి టి.హరీష్‌రావు

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ ఉద్యమనేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ లేకపోతే తెలంగాణ రాష్ట్రం వచ్చేదా? తెలంగాణ లేకపోతే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యేవారా? అంటూ బీఆర్ఎస్ మాజీ మంత్రి టి.హరీష్‌రావు తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తన తండ్రి వయసున్న కేసీఆర్‌పై రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని మండిపడ్డారు. కేసీఆర్ ఒక రాష్ట్రనాయకుడిగా, స్టేట్స్‌మన్‌లా మాట్లాడితే.. రేవంత్‌రెడ్డి మాత్రం రౌడీ భాషలో విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. కృష్ణా–గోదావరి జలాల పంపకం, రాష్ట్ర సమస్యలపై కేసీఆర్ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా వ్యక్తిగత దూషణలకు దిగడం సిగ్గుచేటని హరీష్‌రావు వ్యాఖ్యానించారు. నగర కాలుష్య నివారణ కోసం కేసీఆర్ ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తే, అప్పట్లో ప్రతిపక్ష నేతగా ఉన్న రేవంత్‌రెడ్డి అక్కడికి వెళ్లి ఫార్మాసిటీ వద్దని, రైతులకు భూములు తిరిగి ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చాక మాత్రం భూములు తిరిగి ఇవ్వకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని ఆరోపించారు.

గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టే పరిస్థితి లేదని, నాలుగు నెలలుగా కాస్మెటిక్స్, మెస్ బిల్లులు చెల్లించలేదని విమర్శించారు. గ్రీన్ చానల్ ద్వారా బిల్లులు చెల్లిస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి మాటలు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. విద్యార్థులకు సరైన భోజనం అందించని ముఖ్యమంత్రిని చెట్టుకు కట్టేసి బుద్ధి చెప్పాలనిపిస్తోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. పిల్లల బిల్లులకు కమిషన్లు రావని కావాలనే బిల్లులు పెండింగ్‌లో పెడుతున్నారని ఆరోపించారు. విద్యాశాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా ఈ పరిస్థితికి పూర్తి బాధ్యత రేవంత్‌రెడ్డిదేనని హరీష్‌రావు అన్నారు. కొడంగల్‌లో ఓడితే రాజకీయ సన్యాసం చేస్తానని చెప్పి మాట తప్పిన చరిత్ర రేవంత్‌రెడ్డిదని, పార్టీలు మారడం, మాటలు మార్చడం ఆయనకు అలవాటుగా మారిందని తీవ్రంగా విమర్శించారు.

# హోమ్ లోన్ మాఫీ కోసం భర్తను చంపించిన భార్య

**బలగం టీవీ, మహబూబాబాద్:**

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలంలోని బోడమంచతండాలో హోమ్ లోన్ మాఫీ కోసం భార్యే స్వయంగా భర్తను హత్య చేయించిన దారుణ ఘటన వెలుగుచూసింది. ఈ కేసులో పోలీసులు ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. మృతుడు భూక్య ఈరన్న (45) భార్య భూక్య విజయ (ఏ2), తన ప్రియుడు బోడబాలోజీ (ఏ1) మరియు వారికి సహకరించిన ఆర్ఎంపీ వైద్యుడు ధర్మారపు భరత్ (ఏ3) ఈ ఘాతుకానికి పాల్పడ్డారు.

నిందితులు ఈరన్న పేరుతో ముత్తూట్ ఫైనాన్స్‌లో హౌస్ లోన్ ఇప్పించి, ఒకవేళ అతను ప్రమాదవశాత్తు మరణిస్తే ఆ రుణం మాఫీ అవుతుందని ప్లాన్ చేశారు. పథకం ప్రకారం, డిసెంబర్ 22 రాత్రి మద్యం తాగుదామని ఈరన్నను బయటకు పిలిచి, ఇనుప రాడ్డుతో కొట్టి, ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. అనంతరం దానిని రోడ్డు



ప్రమాదంగా చిత్రీకరించేందుకు మృతదేహాన్ని పొలంలో పడవేశారు. ఈ ఘటనపై కేసముద్రం పోలీసులు క్రైమ్ నంబర్ 303/2025 కింద బీఎన్ఎస్ సెక్షన్లు 61(2), 103(1) r/w 3(5) ప్రకారం కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు తరలించారు.

# రేవంత్ భాష మార్చుకోవాలి

- బూతుల పురాణం మానుకోవాలి
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

**బలగం టీవీ, హైదరాబాద్**



రేవంత్ రెడ్డి తన మాట తీరును మార్చుకోవాలని, బూతుల పురాణం మాట్లాడటం మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య తీవ్ర స్థాయిలో విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రెస్‌మీట్ పెట్టగానే రేవంత్‌రెడ్డికి "లాగు తడిచిపోయిందని", అందుకే నోటికి వచ్చినట్టు మాట్లాడుతున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డికి నిజంగా దమ్ము ఉంటే ముందుగా వైన్ షాపులను మూసివేయాలని సవాల్ విసిరారు. "నీ ఇంట్లో వాళ్లు మద్యం తాగరా?" అంటూ వ్యంగ్యంగా ప్రశ్నించారు. రాహుల్ గాంధీ ఉన్నంత కాలం దేశంలో కాంగ్రెస్ పార్టీకి భవిష్యత్తు లేదని, అలాగే రేవంత్ రెడ్డి ఉన్నంత కాలం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి ఉనికి ఉండదని వ్యాఖ్యానించారు.

"కేటీఆర్ కంటే అందగాడివా నువ్వు? మేకపోతులా ఉండే నువ్వు కేటీఆర్ అందం గురించి మాట్లాడతావా?" అంటూ ఘాటుగా విమర్శించారు. హరీష్‌రావును ఉద్దేశించి మాట్లాడుతూ, "ఆరడుగుల బుల్లెట్ లాంటి హరీష్‌రావు గురించి మాట్లాడే స్థాయి నీకుందా?" అంటూ ప్రశ్నించారు. కేసీఆర్ గురించి మాట్లాడే అర్హత రేవంత్‌రెడ్డికి లేదని మండిపడ్డారు. "కేసీఆర్‌ను ఉద్దేశించి నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నావు. కేటీఆర్‌ను పట్టుకుని అవాకులు, చెవాకులు మాట్లాడుతున్నావు. బూతులు తిట్టే వాడు మా ఊర్లో ఒకడు ఉన్నాడు, నీకు వాడికి పోటీ పెడతాం" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రేవంత్‌రెడ్డి మాటలు వింటే సొంత మనవడే భయపడే పరిస్థితి వస్తుందని, పిట్టలదొర కంటే హీనంగా మాట్లాడుతున్నాడని విమర్శించారు. కేసీఆర్‌కు నాలుగున్నర కోట్ల మంది తెలంగాణ ప్రజల ఆశీర్వాదం ఉందని, ప్రజలు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే రేవంత్‌రెడ్డే రాజకీయంగా అంతమవుతాడని హెచ్చరించారు.

# మేడారం జాతర పనులు నిర్ణీత గడువులో పూర్తి చేయాలి



- మంత్రి సీతక్క
- భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సమన్వయంతో పనులు పూర్తి చేయాలని ఆదేశం
- అభివృద్ధి పనులను పరిశీలన
- అధికారులతో సమీక్ష సమావేశం

**బలగం టీవీ, మేడారం**

మేడారం మహా జాతర ఏర్పాట్లను నిర్ణీ?త సమయంలో పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివ ృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా%––%శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె ఎస్.ఎస్. తాడ్వాయి మండలంలోని మేడారంలో పర్యటించి, సమ్మక్క%–– %సారలమ్మ ఆలయ అభివ ృద్ధి పనులు, పార్కింగ్ స్థలాలు, బస్టాండ్ ప్రాంగణం, వీఐపీ–వీవీఐపీ రోడ్లు, శ్రీరామ్‌సాగర్ చెరువు పరిసరాలు, జంపన్న వాగు వద్ద చేపడుతున్న పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

అనంతరం మేడారంలోని ఐటిడిఏ గెస్ట్ హౌస్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ జంపన్న వాగు పరిసరాల్లో చేపడుతున్న అభివ ృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే నేపథ్యంలో స్నాన ఘట్టాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, కొంగల మడుగు నుంచి జంపన్న వాగు వరకు రహదారుల మరమ్మతులను వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా రహదారి విస్తరణ పనులను వేగంగా చేపట్టాలని, రద్దీ నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీసు శాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి భద్రతా చర్యలను పటిష్టం చేయాలని తెలిపారు.

సమ్మక్క–సారలమ్మ ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివ ృద్ధి పనులను పరిశీలించిన మంత్రి, పనుల వేగం మరింత పెంచాలని, అవసరమైతే అదనపు కార్మికులను నియమించి మూడు షిఫ్టుల్లో పనులు నిర్వహించాలని కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్., ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, ఐటిడిఏ పీవో చిత్ర మిశ్రా, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం సాధారణ సమావేశం

- **మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్**

**బలగం టీవీ, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం నాల్గవ సాధారణ సమావేశం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, బోయినిపల్లి సర్పంచ్ నల్ల మోహన్, డైరెక్టర్ లు మెరుపుల మహేష్, గుడి శేఖర్ రెడ్డి, నిరటి ప్రదీప్, బాలాగోని వెంకటేష్, అద్దంకి రమేష్, రోమల అజయ్, మార్కెట్ కార్యదర్శి పి.రమణ, తదితరులు పాల్గొన్నారు.



## మండేపల్లిలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

మండెపల్లి గ్రామంలోని క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ అంటే కేవలం అలంకరణలు మాత్రమే కాదు ప్రేమను పంచే పండుగ అని నిన్ను వలె నీ పొరుగువానిని ప్రేమించు అన్న ఏసు మాటలను సారాంశాన్ని గుర్తు చేశారు. క్రిస్టమస్ చెట్టు పైకి చూస్తూ ఎదగాలని సూచిస్తే అందులోని నక్షత్రం మనకు సరైన మార్గాన్ని చూపిస్తుందని తెలిపారు. ఈ పండుగ మనందరి జీవితాల్లోని కొత్త వెలుగులో నింపాలని కోరుకుంటూ ప్రజలకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.



## సొంత ఖర్చులతో బోరు వేయించిన సర్పంచ్ నల్ల మోహన్

**బలగం టీవీ, బోయినిపల్లి**

ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలోని 9వ వార్డు ఎస్సీ కాలనీలో సొంత నిధులతో బోరు వేయించిన సర్పంచ్ నల్ల మోహన్. ఈ సందర్భంగా కాలనీ వాసులు సర్పంచ్, ఉపసర్పంచ్ లతో పాటు వార్డు సభ్యులను ఘనంగా సన్మానించారు.



# ఏపీలో పాస్టర్లకు క్రిస్మస్ కానుక..

- **రూ. 50.10 కోట్ల గౌరవ వేతనం విడుదల**

**బలగం టీవీ, అమరావతి**

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలోని పాస్టర్లకు తీపి కబురు అందించింది. ఎన్నికల హామీలో భాగంగా పాస్టర్లకు అందించాల్సిన గౌరవ వేతనం బకాయిలను ప్రభుత్వం బుధవారం విడుదల చేసింది. గత సంవత్సరం డిసెంబర్ నుండి ఈ సంవత్సరం నవంబర్ వరకు 12 నెలలకు గాను, నెలకు రూ.5 వేల చొప్పున అర్హులైన 8,427 మంది పాస్టర్ల ఖాతాల్లో డబ్బులు జమ చేసింది.

# సైబర్ నేరగాళ్ల ఘరానా మోసం..

**ఫైల్ క్లిక్ చేసి రూ.13 లక్షలు పోగొట్టుకున్న ట్రాన్స్‌కో ప్రభుత్వ ఉద్యోగి!**

**సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు..**

**బలగం టీవీ, వేములవాడ**

టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరగాళ్లు సరికొత్త దారుల్లో అమాయకులను నిలువునా ముంచేస్తున్నారు. తాజాగా రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో ఒక ప్రభుత్వ ఉద్యోగి సైబర్ కిలాడీల వలలో పడి భారీ మొత్తంలో నగదు పోగొట్టుకున్నారు.



వేములవాడ పట్టణానికి చెందిన బాధితుడు విద్యుత్ శాఖ (ట్రాన్స్‌కో)లో ఉద్యోగిగా పనిచేస్తున్నారు. తన మొబైల్ ఫోన్‌కు గుర్తుతెలియని నంబర్ నుండి ఒక ఏపీకే ఫైల్ మెసేజ్ రూపంలో వచ్చింది. అది ఏదో ముఖ్యమైన సమాచారం అని భావించిన బాధితుడు, ఆ ఫైల్‌ను డౌన్‌లోడ్ చేసి ఓపెన్ చేశారు. అంతే.. ఆయనకు తెలియకుండానే మొబైల్ ఫోన్ నియంత్రణ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లిపోయింది. మరుక్షణమే ఆయన బ్యాంకు ఖాతా నుండి విడతల వారీగా మొత్తం 13 లక్షల రూపాయలు డ్రా అయినట్లు మెసేజ్‌లు రావడంతో బాధితుడు షాక్‌కు గురయ్యారు. బాధితుడు వెంటనే సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

# సిరిసిల్లలో విషాదం.. సెప్టిక్ ట్యాంక్‌లో పడి బాలుడి మృతి

**బలగం టీవీ, సిరిసిల్ల**

సిరిసిల్ల పట్టణంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. సర్దపూర్‌నగర్ ప్రాంతంలో ఆడుకుంటున్న ఆరేళ్ల బాలుడు ప్రమాదవశాత్తు సెప్టిక్ ట్యాంక్‌లో పడి మృతి చెందాడు. ఈ ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది. స్థానికుల కథనం ప్రకారం.. బుధవారం సాయంత్రం నిర్మాణంలో ఉన్న ఇంటి ఆవరణలో నికేష్ అనే బాలుడు ఆడుకుంటుండగా, తెరిచి ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లో అనుకోకుండా పడిపోయాడు. బాలుడు చాలా సేపు కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు, బంధువులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం సెప్టిక్ ట్యాంక్‌లో బాలుడు అపస్మారక స్థితిలో కనిపించడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. అయితే అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషాద వార్తతో కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నెలకొల్పింది. నిర్మాణాల్లో భద్రతా చర్యలు లేకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

# ఘనంగా అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి వేడుకలు

**బలగం టీవీ, బోయినిపల్లి**

భారతీయ జనతా పార్టీ బోయినిపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో, మండల అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ నాయకత్వంలో ఘనంగా భారత రత్న, మాజీ ప్రధాని అటల్ బీహార్ వాజ్‌పేయిజయంతి వేడుకలు నిర్వహించారు.గొప్ప కవిగా, దేశభక్తుడిగా, దేశం కోసం అహర్నిశలు శ్రమించి దేశం కోసం సేవ చేసిన మహనీయులు అజాతశత్రు భారతరత్న అటల్ జి గారని కొనియాడారు. ప్రభుత్వాలు వస్తూ ఉంటాయి పోతూ ఉంటాయి. పార్టీలు ఏర్పడతాయి, కనుమరుగవుతాయి. కానీ దేశం మాత్రం శాశ్వతంగా ఉంటుందని అటల్ జి అన్నారని గుర్తు చేశారు. తరతరాలకు అటల్ జి జీవితం సూర్తే. భారతరత్న అటల్ బీహారి వాజ్పేయి జయంతి రోజున సుపరిపాలన దినోత్సవం గా కేంద్రప్రభుత్వం ప్రకటించిందన్నారు. అటల్ జి ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థంబంపల్లి సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్,మాజీ మండల అధ్యక్షులు గుడి రవీందర్ రెడ్డి,



సీనియర్ నాయకులు క్యాతం తిరుపతిరెడ్డి, జువ్వెంతుల శ్రీనివాసరెడ్డి , మెరుపుల గంగాధర్, గంగాధర్ చారి,స్వామి కుమార్, కిరణ్ రాజురి, సారంపల్లి రాజు ,ఇల్లందుల బాలయ్య , కళ్యాణ అనిల్ ,సావన్ పల్లి అనిల్, విజయేందర్ రెడ్డి , రజనీకాంత్, రమేష్, ప్రసాద్, సాయికుమార్ , మహేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# క్రిస్మస్ రోజూ ఉక్రెయిన్‌పై రష్యా దాడులు..



**బలగం టీవీ, కీవ్**

క్రిస్మస్ పండుగ రోజున కూడా ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగాయి. పండుగ వాతావరణంలోనూ యుద్ధ మేఘాలు తొలగకపోవడంతో రెండు దేశాల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. క్రిస్మస్ ఈవ్ రోజున రష్యా జరిపిన క్షిపణి దాడుల్లో పలువురు ప్రాణాలు కోల్పోయినట్లు ఉక్రెయిన్ అధికారులు వెల్లడించారు. ఉక్రెయిన్ రాజధాని కీవ్ సహా పలు ప్రాంతాలపై రష్యా భారీ ఎత్తున క్షిపణులు, డ్రోన్లతో దాడి చేసింది. ఈ దాడుల్లో దేశంలోని అతిపెద్ద విద్యుత్ కేంద్రాల్లో ఒకటి తీవ్రంగా దెబ్బతిన్నట్లు సమాచారం. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ నేపథ్యంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు వోలోదిమిర్ జెలెన్స్కీ క్రిస్మస్ రోజున దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "క్రిస్మస్ రాత్రి స్వర్గ ద్వారాలు తెరుచుకుంటాయని మన నమ్మకం. ఆ సమయంలో మనం కోరుకున్నది నెరవేరుతుందని విశ్వసిస్తాం. ఈసారి మనందరి కోరిక ఒక్కటే పుతిన్ అంతమవ్వాలి" అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఉక్రెయిన్ సంప్రదాయ విశ్వాసాలను ప్రస్తావిస్తూ, క్రిస్మస్ రాత్రి చేసే కోరికలు తప్పకుండా నెరవేరుతాయని అన్నారు. అయితే, యుద్ధం కారణంగా తమ ప్రజలు తీవ్ర బాధలు అనుభవిస్తున్నారని, ఈ హింసకు త్వరగా ముగింపు రావాలని ఆకాంక్షించారు. ఇదిలా ఉండగా, క్రిస్మస్ రోజున కూడా రష్యా ఉక్రెయిన్‌పై 131 డ్రోన్లతో దాడి చేసినట్లు సమాచారం. ఉక్రెయిన్ రక్షణ దళాలు వాటిలో చాలా డ్రోన్లను కూల్చివేశాయని వెల్లడించాయి. అయితే దాదాపు 22 డ్రోన్లు లక్ష్యాలను ఛేదించడంతో 15 ప్రాంతాల్లో తీవ్ర నష్టం వాటిల్లినట్లు ఏబీసీ న్యూస్ వెల్లడించింది. యుద్ధం ముగింపు దిశగా ఎలాంటి సంకేతాలు కనిపించకపోవడంతో అంతర్జాతీయ సమాజం తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోంది.

## ఎమ్మెల్యే దానం వ్యాఖ్యలపై చింతల సెటైర్

**బలగం టీవీ, హైదరాబాద్**

ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ చేసిన "దానం ఎక్కడుంటే గెలుపు అక్కడే" అన్న వ్యాఖ్యలపై రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఈ వ్యాఖ్యలకు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి తీవ్ర స్థాయిలో ప్రతిస్పందించారు. దానం రాజకీయ ప్రస్థానం ప్రజలకు బాగా తెలుసని, అధికారమే లక్ష్యంగా రాజకీయాలు చేయడం ఆయన అలవాటుగా మారిందని విమర్శించారు.బీఆర్ఎస్ గుర్తుపై గెలిచి అనంతరం కాంగ్రెస్ పార్టీలో చేరిన దానం, ఇప్పుడు నైతికతలు, విలువల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని చింతల అన్నారు. ప్రజల ఓటుతో గెలిచిన తరువాత నిజంగా ప్రజల మధ్యకు ఎన్ని సార్లు వచ్చారో చెప్పాలని ప్రశ్నించారు. మాటలకే పరిమితమై, పనిలో మాత్రం కనిపించలేదని ఆరోపించారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఉప ఎన్నిక తప్పనిసరిగా జరుగుతుందని స్పష్టం చేసిన చింతల, ఆ ఎన్నికల్లో ప్రజలే దానికి తగిన సమాధానం ఇస్తారని వ్యాఖ్యానించారు. అధికార బలంతో రాజకీయాలు నడిపించవచ్చని భావిస్తే అది పొరపాటేనని అన్నారు.

# 2014తోనే ఆటగాళ్ల ఎంపికలో బంధుప్రీతి అంతం




- ప్రతిభకే ప్రాధాన్యం
- ప్రధాని మోదీ

**బలగం టీవీ, హైదరాబాద్**

ఆటగాళ్ల ఎంపికలో బంధుప్రీతి 2014తోనే ముగిసిందని ప్రధాని నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. ప్రస్తుతం కష్టపడి శ్రమించే, నైపుణ్యం కలిగిన పేద కుటుంబాల పిల్లలు కూడా దేశానికి ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదుగుతున్నారని అన్నారు. యువతలో క్రీడాస్ఫూర్తి, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే లక్ష్యంగా ఢిల్లీలో నిర్వహించిన 'సంసద్ ఖేల్ మహోత్సవ్' కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ.. గతంలో క్రీడారంగంలో అవినీతి, పక్షపాతం ఎక్కువగా ఉండేదని, 2014 తర్వాత ఆ పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. ప్రతిభ ఆధారంగా మాత్రమే అవకాశాలు కల్పించే వ్యవస్థను తమ ప్రభుత్వం తీసుకువచ్చిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న యువ క్రీడాకారుల ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడుతున్నాయని పేర్కొన్నారు.క్రీడలకు కేటాయిస్తున్న నిధుల విషయంలోనూ గణనీయమైన మార్పు వచ్చిందని మోదీ చెప్పారు. 2014కు ముందు క్రీడల బడ్జెట్ రూ.1200 కోట్లకు పరిమితమై ఉండగా, ప్రస్తుతం అది రూ.3 వేల కోట్లకు పైగా పెరిగిందన్నారు. ప్రతిభావంతులైన అథ్లెట్లకు నెలకు రూ.25 వేల నుంచి రూ.50 వేల వరకు ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు. క్రీడా రంగం ద్వారా యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని, దేశ భవిష్యత్తుకు ఇది బలమైన పునాది అవుతుందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.




# నేటి నుంచి ఎస్ఏ20 లీగ్

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రపంచవ్యాప్తంగా క్రికెట్ అభిమానులను ఆకట్టుకుంటున్న ఫ్రాంచైజీ టోర్నీ ఎస్ఏ20 మరోసారి సందడి చేయనుంది. దక్షిణాఫ్రికాలో నిర్వహించనున్న నాలుగో సీజన్ డిసెంబర్ 26 నుంచి ప్రారంభం కానుంది. ఐపీఎల్, బిగ్‌బాష్ లీగ్ తరహాలో వేగంగా ప్రాచుర్యం పొందిన ఈ లీగ్‌లో ఈసారి కూడా ఆరు జట్లు టైటిల్ కోసం పోటీపడనున్నాయి. దాదాపు నెల రోజుల పాటు ఉత్కంఠభరితంగా సాగే ఈ టోర్నీ ఫైనల్ జనవరి 25న జరగనుంది. తొలి మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఎంఐ కేప్‌టౌన్, డర్బన్ సూపర్ జెయింట్స్‌తో తలపడనుంది. డబుల్ రౌండ్ రాబిన్ విధానంలో జరిగే లీగ్ దశ అనంతరం టాప్-4 జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయి

టోర్నీ ప్రారంభానికి ముందు గురువారం జరిగిన కార్యక్రమంలో లీగ్ కమిషనర్ గ్రేమ్ స్మిత్, మాజీ క్రికెటర్లు జేపీ డుమినీ, ఫాఫ్ డుప్లెసిస్, షాన్ పొలాక్, హషీమ్ ఆమ్లా కలిసి ట్రోఫీని ఆవిష్కరించారు. అభిమానులకు థ్రిల్లింగ్ క్రికెట్‌ను అందించేందుకు ఎస్ఏ20 మరోసారి సిద్ధమైందని నిర్వాహకులు తెలిపారు.

# విద్యార్థులకు సరైన ఆహారం అందని పరిస్థితి

- మాజీ మంత్రి టి.హరీష్‌రావు

**బలగం టీవీ, సిద్దిపేట**

సిద్దిపేట పట్టణంలోని నాసార్‌పుర పిల్టర్‌బెడ్ సమీపంలో ఉన్న అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌లో బ్లాంకెట్ల పంపిణీ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ మంత్రి టి.హరీష్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న భోజనం, గుడ్లు, బియ్యం నాణ్యతను పరిశీలించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన హరీష్‌రావు.. చలికాలంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అందుకే బ్లాంకెట్లను పంపిణీ చేశామని తెలిపారు. గత ఐదు నెలలుగా విద్యార్థులకు కాస్మోటిక్స్ చార్జీలు, మెస్ బిల్లులు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రిగా ఉన్న రేవంత్‌రెడ్డి అనాథ పిల్లలకు కూడా భోజనం పెట్టలేని పరిస్థితి నెలకొందని విమర్శించారు.

"గ్రీన్ చానల్ ద్వారా బిల్లులు విడుదల చేస్తామని చెప్పిన రేవంత్‌రెడ్డి మాటలు ఏమయ్యాయి? విద్యార్థులకు సరైన ఆహారం కూడా అందని పరిస్థితి నెలకొంది. ఇలాంటి నిర్లక్ష్యానికి బాధ్యుడు ముఖ్యమంత్రే" అని హరీష్‌రావు మండిపడ్డారు. పిల్లలకు భోజనం పెట్టలేని పరిస్థితి ఉంటే, అలాంటి పాలనపై ప్రశ్నించడం తప్పుకాదన్నారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ, "తండ్రి వయసున్న కేసీఆర్‌ను ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడడం సరికాదు. రాష్ట్ర సాధకుడైన కేసీఆర్‌ను వీధి రౌడీలా మాట్లాడటం దుర్మార్గం" అని విమర్శించారు. కేసీఆర్ లేకపోతే తెలంగాణే ఉండేదా? అని ప్రశ్నించారు. ఇక రేవంత్‌రెడ్డి రాజకీయ ప్రవర్తనపై తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ, "కమిషన్లు కొట్టడం, చిల్లర మాటలు మాట్లాడడం, పార్టీలు మారడం, సీట్లు కొనడం ఆయనకు అలవాటు. 20 శాతం కమిషన్ ఇచ్చేవారికే బిల్లులు చెల్లిస్తున్నారు. కమిషన్ ఇవ్వని వారికి పెండింగ్ పెడుతున్నారు" అని ఆరోపించారు. చివరగా, చిల్లర రాజకీయాలు మానుకుని పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడవద్దని హరీష్‌రావు డిమాండ్ చేశారు.




# 'ది రాజాసాబ్' నుంచి క్రిస్మస్ స్పెషల్ అప్‌డేట్..

**బలగం టీవీ, హైదరాబాద్**

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న భారీ చిత్రం 'ది రాజాసాబ్' విడుదలకు సిద్ధమవుతోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ సినిమా దాదాపు ఏడాదిన్నర కాలంగా షూటింగ్ పూర్తి చేసుకొని, సంక్రాంతి కానుకగా జనవరి 9న ప్రేక్షకుల ముందుకు రానుంది.ఈ చిత్రంలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవికా మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పోస్టర్లు సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. తాజాగా క్రిస్మస్ సందర్భంగా మేకర్స్ మరో స్పెషల్ అప్‌డేట్ ఇచ్చారు.

క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని చిత్రబృందం విడుదల చేసిన 40 సెకన్ల స్పెషల్ ప్రోమో ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఇందులో ప్రభాస్ శాంతాక్లాజ్ వేషంలో కనిపించడం, నిధి అగర్వాల్ చర్చిలో ప్రార్థన చేస్తూ కనిపించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'రాజే యువరాజే' అంటూ సాగే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ ఈ వీడియోకు మరింత హైలైట్‌గా నిలుస్తోంది. హారర్ కామెడీ జానర్‌లో రూపొందుతున్న ఈ చిత్రాన్ని దర్శకుడు మారుతి వినూత్నంగా తెరకెక్కిస్తున్నారని మేకర్స్ వెల్లడించారు. భారీ నిర్మాణ విలువలతో రూపొందుతున్న ఈ సినిమా సంక్రాంతి బాక్సాఫీస్‌ను షేక్ చేయడం ఖాయమని అభిమానులు అంచనా వేస్తున్నారు.

# తెలంగాణకు నీటి హక్కుల విషయంలో తీవ్ర అన్యాయం

- ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

**బలగం టీవీ, సూర్యాపేట**

తెలంగాణలో నీటి హక్కుల విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఆరోపించారు. కృష్ణా-గోదావరి జలాల విషయంలో రాష్ట్రానికి తీవ్ర నష్టం జరుగుతుండగా ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సూర్యాపేటలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సమైక్యాంధ్ర కాలంలో జరిగిన దోపిడీ మళ్లీ కొనసాగుతోందని విమర్శించారు. కేసీఆర్ ఏ అంశంపై మాట్లాడినా ఎదురుదాడి చేయడం పరిపాటిగా మారిందని, అనుభవం లేని వారు పాలనలో ఉన్నారని ధ్వజమెత్తారు. కృష్ణా జలాలపై అసెంబ్లీలో కేసీఆర్ తీర్మానం తీసుకువచ్చినప్పుడు స్పందించలేని వారు ఇప్పుడు రాజకీయ ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. బనకచర్ల ప్రాజెక్టుపై నిర్లక్ష్య వైఖరి అవలంబించారని, ఉద్యమం చేపట్టగానే వెనక్కి తగ్గారని గుర్తు చేశారు.

కృష్ణా నదిపై చంద్రబాబు గండి కొడుతున్నారని, ఇరిగేషన్ మంత్రికి అవగాహన లేక 40 టీఎంసీలకు ఒప్పుకున్నారని ఆరోపించారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు 90 టీఎంసీలు అందించేందుకు గతంలో రూ.27 వేల కోట్లు ఖర్చు చేశామని, ఇప్పుడు మిగిలిన పనులు




పూర్తి చేయకుండా ప్రజలకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. మోడీ, చంద్రబాబు కలిసి రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారని, వారికి రేవంత్ రెడ్డి అవసరం కానీ ప్రజలకు అవసరం లేదని విమర్శించారు. ప్రజల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా తన స్థాయిని తానే తగ్గించుకుంటున్నాడని అన్నారు. రేవంత్ రెడ్డి కేసీఆర్ స్థాయికి సరిపోడని, ముఖ్యమంత్రి హోదాకు తగని వ్యాఖ్యలు చేస్తున్నాడని విమర్శించారు. ప్రజలు తగిన సమయంలో సరైన తీర్పు ఇస్తారని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రజల్లోకి వస్తే భయపడాల్సిన అవసరం లేదని, దమ్ముంటే ఆయన అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు.




# 'నువ్వు నాకు నచ్చావ్' రీ రిలీజ్ ట్రైలర్ విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

వెంకటేశ్, ఆర్తి అగర్వాల్ జంటగా నటించిన సూపర్ హిట్ క్లాసిక్ మూవీ 'నువ్వు నాకు నచ్చావ్' మరోసారి ప్రేక్షకుల ముందుకు రానుంది. త్రివిక్రమ్ కథ, మాటలు అందించగా.. కె. విజయభాస్కర్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం 2001లో విడుదలై బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. సురేశ్ బాబు సమర్పణలో శ్రీ స్రవంతి మూవీస్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ సినిమా ఇప్పటికీ తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో ప్రత్యేక స్థానం కలిగి ఉంది. ప్రకాశ్‌రాజ్, సుహాసిని, చంద్రమోహన్, సునీల్, ఆశా సైనీ, బ్రహ్మానందం, ఎంఎస్ నారాయణ, సుధ, హేమ వంటి నటుల అద్భుతమైన నటనతో పాటు కోటి సంగీతం ఈ సినిమాకు మరింత మాధుర్యాన్ని చేకూర్చింది. ఈ చిత్రం అప్పట్లో తమిళం, కన్నడ, బెంగాలీ భాషల్లోనూ రీమేక్ అయింది. ఇప్పుడు ఈ క్లాసిక్ మూవీని 4కే రీమాస్టర్ వెర్షన్‌లో తిరిగి థియేటర్లలో విడుదల చేయనున్నారు. నూతన సంవత్సర కానుకగా జనవరి 1న ఈ సినిమా రీ-రిలీజ్ కానుంది. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ ప్రేక్షకుల్లో నాస్టాల్జియాను రేకెత్తిస్తోంది. తరం మారినా తగ్గని ఆకర్షణతో 'నువ్వు నాకు నచ్చావ్' మరోసారి వెండితెరపై మాయ చేయనుంది.

# 'ఈషా'పై ఉద్దేశపూర్వక నెగటివ్ ప్రచారం: నిర్మాతల ఆవేదన

**బలగం టీవీ, హైదరాబాద్**

హారర్ థ్రిల్లర్ చిత్రం 'ఈషా'పై కొందరు ఉద్దేశపూర్వకంగా నెగటివ్ ప్రచారం చేస్తున్నారని నిర్మాత బన్నీ వాసు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రీమియర్ షోలకు టిక్కెట్లు బుక్ చేసి, సినిమా రేటింగ్‌ను పతనం చేయడం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు. బన్నీ వాసు ప్రకారం, ప్రీమియర్ షోకు 200%-%300 టిక్కెట్లు బుక్ చేసి, షో తర్వాత అందరూ 1 రేటింగ్ ఇవ్వడం ద్వారా బుక్ మై షో రేటింగ్ దెబ్బతింటోందని చెప్పారు. "సినిమాను చూసిన తర్వాత మాత్రమే రేటింగ్ ఇవ్వండి, ఫేక్ రేటింగ్‌లకు ప్రభావితం అవ్వకండి." అని ప్రేక్షకులకు సూచించారు. "ఇలాంటివి నా జీవితంలో ఎన్నిసార్లు జరిగిన సంగతి తెలుసు. ఇప్పుడు 'ఈషా' నిర్మాతలు దీన్ని ఎదుర్కొంటున్నారు," అని బన్నీ వాసు తెలిపారు. కొందరు సినిమా చూడకుండానే ఫేక్ నెగటివ్ రివ్యూలు ఇస్తున్నారని. నిర్మాత వంశీ నందిపాటి తెలిపారు, ఈ చిత్రం అమెరికాలో ఇంకా విడుదల కాలేదు, అయినప్పటికీ అక్కడ ఒకరు నెగటివ్ రిపోర్ట్ ఇచ్చారు. "రివ్యూ రాసిన వ్యక్తిని అడిగితే, పరిశ్రమలో కొంతమంది చూసి చెప్పారని సమాధానం ఇచ్చాడు. సినిమా చూడకుండానే నెగటివ్ రివ్యూ ఇవ్వడం ద్వారా ప్రజలు తప్పుగా ప్రభావితమవ్వకూడదు," అన్నారు. ప్రీమియర్ షోల్లో థియేటర్లు నిండిపోయాయి, సినిమా చూసిన ప్రేక్షకులు బాగుందని తెలియజేశారన్నారు.